

5

గ్రామాల్లో కుక్కలు.. కోతుల **స్వైరవిహారం!**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3   సంచిక -66   ఆదివారం 9 ఆగస్టు 2026   ఎడిటర్ : బిర్రు కరుణాకర్   పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టొద్దు



**మూడేళ్లుగా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదు?..**

**కేంద్రానికి రాహుల్ గాంధీ ప్రశ్న**

**మహిళా రిజర్వేషన్ బిల్లుపై రిజిజుకు రాహుల్ కౌంటర్**

**2023లోనే బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని వెల్లడి**

**2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్**

**ఢిల్లీ ఆగస్టు 8**
మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కౌంటర్ ఇచ్చారు. 2023లోనే కాంగ్రెస్ పూర్తి మద్దతుతో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని గుర్తుచేశారు. మూడేళ్లు గడిచినా చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదు. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లోనే కాంగ్రెస్ పూర్తి మద్దతుతో **మిగతా 2లో...**

# ప్రాజెక్టుల భూసేకరణకు 5వేల కోట్లు

## అటవీ, పర్యావరణ అనుమతులపై నిర్లక్ష్యం వద్దు

### మిడ్ మానేర్ ఎడమ కాలువ పనుల పునః ప్రారంభం

### : నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హైదరాబాద్‌ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు ఆగొద్దని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీర్.అంబేద్కర్ సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్లు ప్రాధాన్యతా క్రమంలో విడుదల చేస్తామని చెప్పారు. నిధుల కొరత కారణంగా చివరి దశలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి**మిగతా 2లో...**

## ఎప్పటికప్పుడు నేర్చుకునేవారే విజయం సాధిస్తారు

**టెక్నాలజీతో ఉద్యోగాలు, పరిశ్రమలు మారుతున్నాయని మోదీవ్యాఖ్య**

**యువత నిర్ణయాలు 'వికసిత్ భారత్'పై ప్రభావం చూపుతాయని వెల్లడి**

**వచ్చే 30-35 ఏళ్లు యువతకు కీలకమని హితవు**

**పరిశోధన, కొత్త ఆలోచనల్లో అవకాశాలు పెరుగుతున్నాయని వెల్లడి**




**ఢిల్లీ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచం వేగంగా మారుతోంది.. టెక్నాలజీతో పాటు ఉద్యోగాలు, పరిశ్రమలు కూడా కొత్త రూపం దాలుస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రయాణంలో ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండేవారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని అన్నారు.ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో శనివారం మోదీ ప్రసంగించారు. ప్రపంచంలో వ్యూహాత్మక మార్పులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. టెక్నాలజీ అభివృద్ధి ఈ మార్పులకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాబోయే 20-30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందో కచ్చితంగా**మిగతా 2లో...**

## నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

### పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు




**హైదరాబాద్,ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
:హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 **మిగతా 2లో...**

## 2028నాటికి ఎయిర్‌ట్యాక్సీలు

**కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు**

**విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**



**బెంగళూరు ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు వచ్చే ఏడాది వేగవంతం కానున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెంగళూరులో సర్లా ఏవియేషన్ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు.ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి రద్దీగా **మిగతా 2లో...**

## గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి



**టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు**

**ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన**

**డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి**

**పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక**

**ప్రతి ఎన్నికలోనూ గతంలో కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్య నిర్దేశం**

## వివేకా హత్య కేసులో న్యాయం కోసం రాష్ట్రపతికి కుమార్తె సునీత లేఖ

**ఏడేళ్లు దాటినా పూర్తిస్థాయి న్యాయం జరగలేదని ఆవేదన**

**హత్య వెనుక భారీ కుట్ర, మనీ ట్రయల్‌పై సమగ్ర విచారణకు విజ్ఞప్తి**

**హత్య వార్త జగన్‌కు ముందుగా ఎలా తెలిసిందో తేల్చాలని అభ్యర్థన**

**ప్రధాని, ఏపీ, తెలంగాణ సీఎంలకు కూడా లేఖ ప్రతులు**



**ఢిల్లీ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. తన తండ్రి హత్యకు గురై ఏడేళ్లకు పైగా గడిచినా తమ కుటుంబానికి**మిగతా 2లో...**

## శ్రీశైలానికి పోటెత్తిన వరద..

**నిండుకుండలా మారుతున్న జలాశయం**

**కృష్ణానది నుంచి శ్రీశైలానికి భారీగా వరద నీరు**

**875 అడుగులకు చేరువలో జలాశయం నీటిమట్టం**

**ప్రస్తుత నీటి నిల్వ 162 టీఎంసీలు, పూర్తి సామర్థ్యానికి 10 అడుగుల దూరం**

**రెండు రాష్ట్రాల పవర్‌హౌస్‌లలో మొదలైన విద్యుదుత్పత్తి**

**నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల**



**శ్రీశైలం ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి జూరాల ప్రాజెక్టు **మిగతా 2లో...**

## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

**తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు**

**నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది**

**నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి**

**మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్,ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా **మిగతా 2లో...**

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

**మొదటిపేజీ తరువాయి**

వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొటాలి

**అమరావతి,ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**

ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు.

ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు.

ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు.

గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# ప్రాజెక్టుల భూసేకరణకు 5వేల కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

వీల్లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. నాలుగున్నరేండ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధనడ ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి-83 నుంచి డి-94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయనీ, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు.

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయని చెప్పారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే ప్రాజెక్టును వాడుకలో తీసుకు రావాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. సమీక్షలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓవి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రెటరీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 2028నాటికి ఎయిర్‌ట్యాక్సీలు

**మొదటిపేజీ తరువాయి**

ఉండే మహానగరాలకు కొత్త రవాణా మార్గాన్ని అందించగలవని అన్నారు. బెంగళూరులోనే కాకుండా, ముంబై, ఢిల్లీలలో కూడా వీటికి చాలా అవసరం ఉందని ఆయన చెప్పారు. 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ సాంకేతికత ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని మంత్రి తెలిపారు. గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు.

'సర్లా ఏవియేషన్' కంపెనీకి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మంజూరు చేసిందని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వచ్చే ఏడాది పూర్తిస్థాయి టెస్టింగ్ ఫేజ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ముఖ్యంగా ఇది పైలట్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇందులో మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లు ఉంటాయి (6 టేకాఫ్ కోసం, 1 ముందుకు వెళ్లేందుకు) ఇది ప్యూర్ ఎలక్ట్రిక్ ఆధారిత విమానం అయినప్పటికీ, అవసరమైతే గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే వెసులుబాటు కూడా దీని డిజైన్‌లో ఉంది. స్వదేశీ తయారీ కావడంతో తక్కువ ధర: విమానయాన పరికరాలు (అవియోనిక్స్) మినహా మిగిలిన విడిభాగాలన్నీ భారత్‌లోనే తయారు కానున్నందున ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల మద్దతు ఉన్న ఈ స్టార్టప్‌తో ఇప్పటికే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ శంషాబాద్/లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం, మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలే కాకుండా ఎయిర్ అంబులెన్స్, అత్యవసర వైద్య రవాణా, కార్గో సేవల రంగంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించడమే కాక విదేశాలకు కూడా విమానాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## శ్రీశైలానికి పోటెత్తిన వరద..

**మొదటిపేజీ తరువాయి**

నుంచి 2,57,059 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా, శ్రీశైలం జలాశయానికి 2,11,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం అది 874.70 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయిలో నిండటానికి మరో 10 అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 162.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రెండు, మూడు రోజుల్లో నీటి నిల్వ 200 టీఎంసీలను దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు.

భారీగా వరద నీరు వస్తుండటంతో అధికారులు జలవిద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. తెలంగాణ పరిధిలోని ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 21,189 క్యూసెక్కుల నీటిని వినియోగించి 7.319 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 9,603 క్యూసెక్కుల నీటితో 1.684 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుదుత్పత్తి అనంతరం 30,792 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. వీటితో పాటు వెలిగోడుకు 4,000 క్యూసెక్కులు విడుదల చేయగా, శనివారం గోరకల్లు జలాశయానికి మరో 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



# ఎప్పటికప్పుడు నేర్చుకునేవారే విజయం సాధిస్తారు




**మొదటిపేజీ తరువాయి**

చెప్పలేమన్నారు. అయితే మార్పులు సవాళ్లతో పాటు కొత్త అవకాశాలను కూడా తీసుకొస్తాయని తెలిపారు. ప్రస్తుత తరం యువతకు ప్రత్యేక బాధ్యత ఉందని మోదీ అన్నారు. వచ్చే 30-35 ఏళ్లలో వారు తీసుకునే నిర్ణయాలు 'వికసిత్ భారత్' ప్రయాణంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని సూచించారు.పరిశోధన, కొత్త ఆలోచనల్లోనూ యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని మోదీ చెప్పారు. ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ పథకం ద్వారా యువ పరిశోధకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. పరిశోధన రంగానికి రూ.1 లక్ష కోట్ల వరకు నిధులు సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా ప్రముఖ అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ దేశంలోని చిన్న పట్టణాలకూ అదనపు ఖర్చు లేకుండా అందుతున్నాయని మోదీ తెలిపారు. ఐఐటీ ఢిల్లీలో 3,000 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు అందించారు. ఇందులో 587 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు.అదే కార్యక్రమంలో ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరమ్ ప్రజ్ఞ' ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ సదుపాయాన్ని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది ఏఐ, డేటా సైన్స్, ఆధునిక కంప్యూటింగ్, పరిశోధనకు ఉపయోగపడనుంది.

# వివేకా హత్య కేసులో న్యాయం కోసం రాష్ట్రపతికి కుమార్తె సునీత లేఖ

**మొదటిపేజీ తరువాయి**

ఇంతవరకు పూర్తి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉందని ఉద్ఘాటించారు. కేసు దర్యాప్తులో వెలుగు చూడని అనేక కీలక అంశాలను వెలికితీయాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆమె తన లేఖలో కోరారు.

ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన సీబీఐ దర్యాప్తు, తదనంతర పరిణామాలను సునీత తన లేఖలో రాష్ట్రపతికి వివరించారు. హత్య జరిగి ఇన్నేళ్లయినా నేటికీ హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేకపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హత్య వెనుక ఉన్న పెద్ద కుట్రను, కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీల కోణాన్ని సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కొన్ని కీలకమైన అంశాలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు దిశ, ఈనాడు పత్రికలు కథనాలు ప్రచురించాయి.ముఖ్యంగా, వివేకా హత్య వార్త బయటకు రాకముందే అప్పటి ప్రతిపక్ష నేత జగన్ కు ఎలా తెలిసిందనే అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని సునీత కోరారు. ఈ విషయంలో జగన్ పాత్రపై విచారణ జరపాల్సి ఉందని 2023 మే 25న సీబీఐ స్వయంగా హైకోర్టులో దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌ను ఆమె తన లేఖలో ఉటంకించారు. ఈ కీలక అంశాన్ని ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్) ఏర్పాటు చేసినా, ఆ తర్వాత సీబీఐ నాలుగు చార్జిషీట్లు దాఖలు చేసినా, కేసులో లోతైన దర్యాప్తు జరగలేదనే భావనను ఆమె వ్యక్తం చేశారు.తాను న్యాయస్థానాల విచారణలో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని, దర్యాప్తులో ఇప్పటివరకు బయటకు రాని వాస్తవాలను వెలికితీయాలన్నదే తన ఉద్దేశమని సునీత స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తును డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) లేదా కేంద్ర హోం మంత్రిత్వ శాఖలోని అధికారికి బదిలీ చేయాలని అభ్యర్థించారు. నిర్ణీత కాలపరిమితిలో దర్యాప్తును సంతృప్తికరంగా ముగించి, వాస్తవాలను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం, న్యాయ శాఖ మంత్రులు, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలకు కూడా ఆమె ఈ లేఖ ప్రతులను పంపారు. ఏడేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నామని, ఇకనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు సునీత తన లేఖలో పేర్కొన్నారు.

# మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఏకగ్రీవంగా ఆమోదం పొందింది' అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ఎందుకు ముడిపెడుతున్నారని ప్రశ్నించారు. 2023లో ఆమోదించిన చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు.


మహిళలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పగలగాలని రాహుల్ ఇటీవల వ్యాఖ్యానించారు. మహిళల సాధికారత రాజకీయాలు, వ్యాపారానికి మాత్రమే పరిమితం కావొద్దని అన్నారు. ఇళ్లు, కుటుంబాలు, బహిరంగ ప్రదేశాల్లోనూ మహిళలకు స్వేచ్ఛ ఉండాలని చెప్పారు. దీనిపై రిజిజు స్పందిస్తూ.. కాంగ్రెస్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు.2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా రూపొందించారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి.మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయాలంటూ 2026 ఏప్రిల్‌లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లును తీసుకొచ్చారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ముందుగానే డీలిమిటేషన్ చేపట్టాలని ఇందులో ప్రతిపాదించారు. అయితే లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ రాకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు.

# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

**మొదటిపేజీ తరువాయి**

గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ÷÷-లఓల్గ÷వర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో డబ్బుల దందాపై చర్చ




**వర్ధన్నపేట/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ కోసం వచ్చిన మహిళ బంధువుల నుంచి డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఈ విషయంపై ఆర్ఎంఓ స్పందించి పేషెంట్ బంధువుల నుంచి డబ్బులు తీసుకోవద్దని సూచించడంతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అనంతరం సంబంధిత స్వీపర్‌ను స్థానచలనం చేసినట్లు ఆస్పత్రి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. స్థానచలనంపై సదరు సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నగదు వసూళ్ల ఆరోపణలు వాస్తవమా కాదా అనేది విచారణలో తేలాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవాలను అధికారులు వెల్లడించాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.20 లక్షల ఎల్ఓసీ

## అనారోగ్యంతో బాధపడుతున్న కేదారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేయూత



**వేలేరు/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలేరు మండల కేంద్రానికి చెందిన సింగం కేదారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 1.20 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. ఈ మేరకు హనుమకొండలోని తన కార్యాలయంలో శనివారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎల్ఓసీ చెక్కును కేదారికి అందజేశారు. కేదారి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి దృష్టికి వచ్చింది. చికిత్సకు ఆర్థిక సాయం అవసరమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేదారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, సర్పంచ్ బిల్లా యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందుతుందని వారు పేర్కొన్నారు.

# వంగపహాడ్‌కు వెలుగుల బాట

## వంగపహాడ్ఆరేపల్లి మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటు

## రాత్రి ప్రయాణికులకు తప్పిన చీకటి ఇబ్బందులు

**హసన్‌పర్తి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
వంగపహాడ్ గ్రామం నుంచి ఆరేపల్లి వరకు విద్యుత్ దీపాల ఏర్పాటు పూర్తవడంతో ఆ మార్గం వెలుగులతో కళకళలాడుతోంది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళల్లో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలకు చీకటి ఇబ్బందులు తొలగనున్నాయి. ఇప్పటివరకు రాత్రివేళల్లో చీకటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, గ్రామస్థులకు విద్యుత్ దీపాల ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ప్రయాణించేందుకు భద్రత పెరగనుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వంగపహాడ్ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



**వెలుగులు నింపిన మార్గం**


వంగపహాడ్ఆరేపల్లి మార్గంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రివేళల్లో ప్రయాణించే వారికి భద్రతతోపాటు ప్రజలకు సౌకర్యం కలగనుంది. అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎక్స్‌డీసీసీబీ డైరెక్టర్ పొలం అనిల్‌రెడ్డి, పొన్నాల రఘు, దోమ కుమార్, రుద్రారం శ్రీనివాస్, జీడబ్ల్యూఎంసీ లైన్‌మెన్ గుర్రపు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధురాలి అదృశ్యం కేసులో అల్లుడిపై అనుమానాలు

## పామ్‌ఆయిల్ తోటలో కాలిన అస్థికలు గుర్తింపు

## డీఎన్ఏ నిర్ధారణకు నమూనాలు.. పోలీసుల దర్యాప్తు

**సత్తుపల్లి/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన వెంకట నరసమ్మ (60) అదృశ్యం కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నెల 3న నరసమ్మ కనిపించడం లేదని ఆమె కుమార్తెలు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టగా నరసమ్మ అదృశ్యం వెనుక ఆమె అల్లుడి పాత్ర ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమైనట్లు సమాచారం. ఈ క్రమంలో పామ్‌ఆయిల్ తోటలో కాలిపోయిన మానవ అవశేషాలను పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫోరెన్సిక్ నిపుణులు కాలిన అస్థికలు, ఇతర అవశేషాలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. అవి అదృశ్యమైన వెంకట నరసమ్మకు చెందినవేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్షలకు నమూనాలను పంపించినట్లు తెలిసింది. కాగా, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నిర్ధారించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అనుమానితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం. డీఎన్ఏ నివేదిక, పోలీసుల దర్యాప్తు అనంతరం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# అర్హులందరికీ చేయూత పెన్షన్

## ముప్పారం గ్రామసభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి -సర్పంచ్ గుంటిపల్లి రేణుక అధ్యక్షతన దరఖాస్తుల స్వీకరణ







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సూచించారు. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో సర్పంచ్ గుంటిపల్లి రేణుక అధ్యక్షతన శనివారం నిర్వహించిన చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చేయూత పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, ప్రభుత్వ నిబంధనలపై సర్పంచ్ గుంటిపల్లి రేణుక, గ్రామ నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. జిల్లాలోనే తొలిసారిగా ముప్పారం గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్ల మంజూరులో ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు కడియం శ్రీహరి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెన్షన్‌కు అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు విధానం, నిబంధనలను ఫ్లెక్సీల రూపంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని అన్నారు. దండోరా ద్వారా గ్రామ ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. అర్హులైన ఒక్కరూ దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మృతుల కుటుంబాలకు పరామర్శ అనంతరం ముప్పారం ఉపసర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి తల్లి వరమ్మ ఇటీవల మృతిచెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు శ్రీరాముల వెంకటేశ్వర్లు తల్లి మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలనకు చరమగీతం పాడాలి

## సెప్టెంబర్ 1న చలో ఢిల్లీని విజయవంతం చేయాలి -సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ఎల్కతుర్తి/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. బీజేపీ పాలనలో మార్పు రావాలని, మోదీ ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న చేపట్టనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా పాదయాత్ర శనివారం మూడో రోజు ఎల్కతుర్తి మండలంలో కొనసాగింది. కోతులనడుమ, సూరారం, బావుపేట మీదుగా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చేరుకున్న పాదయాత్ర ప్రధాన కూడలి నుంచి బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.



ఎన్నికల ముందు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ధరలను నియంత్రించడంలో విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడంతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించేందుకు ఆగస్టు 6 నుంచి దేశవ్యాప్తంగా ప్రచార జాతా పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. హనుమకొండ జిల్లాలో ఆగస్టు 6 నుంచి 11 వరకు నిర్వహించే ప్రచార జాతా పాదయాత్రలను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 1న ఢిల్లీలో చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని భిక్షపతి కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నేదునూరి రాజమౌళి, ఎన్.ఏ. స్టాలిన్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, నిమ్మల మనోహర్, బొంత మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళి

## తెలంగాణ ఉద్యమానికి ఆయన సేవలు చిరస్మరణీయం

## హసన్‌పర్తిలో బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



**హసన్‌పర్తి/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచే వ్యవస్థాపక సభ్యుడిగా కొనసాగిన పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తరించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. నర్సంపేట ఎమ్మెల్యేగా పనిచేస్తూ నియోజకవర్గ ప్రజలకు అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమానికి పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన మరణం నర్సంపేట నియోజకవర్గ ప్రజలతోపాటు తెలంగాణ ఉద్యమకారులకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, ఆత్మ హనుమకొండ జిల్లా మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మాజీ మండల అధ్యక్షుడు ఆకుల కుమార్, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు గరిగె మురళి, జన్ను కిషన్, వీసం కరుణాకర్‌రెడ్డి, గుండవేని మురళీకృష్ణ, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పురుగుమందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

## పెంచికల్‌పేట్‌లో రైతులకు అవగాహన

**ఎల్కతుర్తి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
పంటలపై పురుగుమందులను విచక్షణారహితంగా వినియోగించకుండా, సూచించిన మోతాదులోనే ఉపయోగించాలని బీసీఐ ఫీల్డ్ ఆఫీసర్ వంగా రఘు రైతులకు సూచించారు. నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్ గ్రామంలో శనివారం రైతులకు పంట రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా రఘు మాట్లాడుతూ పురుగుమందుల డబ్బాలపై ఉన్న సూచనలు, హెచ్చరికలను పూర్తిగా చదివిన తర్వాతే వినియోగించాలని తెలిపారు. పురుగుమందుల పిచికారీ సమయంలో వ్యక్తిగత రక్షణ పరికరాలు



ఉపయోగించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సురక్షితమైన ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు అవగాహన కల్పించారు.

అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పురుగుమందుల సురక్షిత వినియోగం, పీపీఈ ప్రాధాన్యత, హెచ్‌హెచ్‌పీపై రైతులకు వివరించారు. బయోచార్ వినియోగంతో నేల ఆరోగ్యం, తేమ నిల్వ సామర్థ్యం, పంట ఎదుగుదల మెరుగుపడతాయని తెలిపారు. అంతర పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ కార్డుల ద్వారా పురుగులను గుర్తించి నియంత్రించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సురక్షితమైన పంట రక్షణ పద్ధతులను పొలాల్లో అమలు చేసేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేశారు. సంస్థ ప్రతినిధులు రావుల లత, సురకంటి రజిత, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా అంబాల జగన్

## పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

**ఎల్కతుర్తి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా అంబాల జగన్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్ఠానం సోషల్ మీడియా విభాగంలో చేపట్టిన నూతన నియామకాల్లో భాగంగా జగన్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా అంబాల జగన్ మాట్లాడుతూ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్‌గా పెట్టం నవీన్ నియమితులైనందుకు హర్షం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా ద్వారా తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అంబాల జగన్ పేర్కొన్నారు.



## రోడ్డుపై గుంతలు పుడ్చే కార్యక్రమం చేపట్టిన సర్పంచ్.



**బయ్యారం/,ఆగస్టు 8.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలో అధ్వానంగా మారిన రహదారిపై ఏర్పడిన గుంతలను గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది ఈ పనులు చేపట్టారు. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ పేర్కొన్నారు.ప్రమాదాలను నివారించేందుకు తాత్కాలికంగా గుంతలను పూడ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాంబాబు,వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్లుగా జెండా మోసినోళ్లను మరిచిపోవద్దు!

### కాంగ్రెస్ కమిటీల్లో పాత కార్యకర్తలకే ప్రాధాన్యం ఇవ్వాలి

### ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులా? - వలీ పాషా



**వర్ధన్నపేట/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న పాత నాయకులు, సీనియర్ కార్యకర్తలకే రాబోయే గ్రామ కమిటీల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని వెంకట్రావుపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వలీ పాషా కోరారు. గత 12 ఏళ్లుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి, పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా పాల్గొనని వారికి గ్రామ అధ్యక్ష పదవులు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం బాధాకరంగా ఉందన్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన సీనియర్ కార్యకర్తలను విస్మరిస్తే కేడర్‌లో నిరాశ నెలకొనే అవకాశం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ నాయకత్వం స్పందించి పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకు సముచిత గుర్తింపు ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కావాలంటే పాత, నిబద్ధత కలిగిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మిట్టపల్లి రమేష్, బూడిద శ్రీనివాస్, మడత రాములు, నాలం సుధాకర్, గాడిపెల్లి సతీష్, జడ రాజు, బండి సందీప్, బలరాములు, మడత సంజీవ, మడత ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దాడి ఘటనపై కేసు నమోదు

### ఐదుగురికి గాయాలు.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**గీసుగొండ/ ఆగస్టు 8(జర్నలిస్ట్ వార్త);** నందనాయక్ తండాలో దాడి ఘటనపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.తండాకు చెందిన బాదవత్ రాజు (70) ఇంటి ముందు కూరగాయల దుకాణం నిర్వహించుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో బాదవత్ రాజేష్ మద్యం సేవించి వచ్చి రాజును, ఆయన భార్య చిట్టెమ్మను దూషిస్తూ దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది.
ఈ ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన సపావత్ మంగమ్మ, ఆమె కుటుంబ సభ్యులపై కూడా రాజేష్ దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగమ్మపై కర్రతో దాడి చేయడంతో కుడి భుజానికి గాయమైందని, ఆమె భర్త సపావత్ భద్రు అడ్డుకునే క్రమంలో కిందపడిపోవడంతో ముక్కు, పెదవులకు గాయాలై రక్తస్రావమైందని తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చిట్టెమ్మ స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందినట్లు పోలీసులు తెలిపారు.ఫిర్యాదు మేరకు బాదవత్ రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఆపదలో నేనున్నానంటూ భరోసా!

### బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నాగరాజు అండ





**ఐనవోలు/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భరోసా కల్పించారు. ఐనవోలు మండల కేంద్రం, పున్నెలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన అవునూరి ఒదమ్మ, కొండేటి కోవూరుమల్లమ్మ, గుడికందుల లక్ష్మీకాంత, గండి సదానందం కుటుంబాలను మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. కష్టాల్లో ఉన్న వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్తలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, జేబీఎం జిల్లా అధ్యక్షుడు జన్నపురెడ్డి రుగ్వేద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పొలపెల్లి బుచ్చిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎలిశా, మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, ఉప సర్పంచ్ భాస్కర్, సీనియర్ నాయకులు మధుగౌడ్, తిరుపతిరెడ్డి, రవి, సునీల్, సుధీర్, రాకేష్‌రెడ్డి, సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా వరుణ హోమం

### సకాలంలో వర్షాలు కురవాలని నీలాద్రి నీలాద్రీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు -అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు








**పెనుబల్లి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
సకాలంలో వర్షాలు కురవాలని.. అతివృష్టి, అనావృష్టి లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పెనుబల్లి మండలం నీలాద్రిలోని శ్రీ నీలాద్రి నీలాద్రీశ్వరస్వామి దేవాలయంలో శనివారం వరుణ హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన కార్యక్రమంలో పుణ్యవచనం, వరుణ హోమం, వరుణ జపం, ఋష్యశృంగ ఆవాహనం, సహస్ర ఘటాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.దేవాలయంలో నూతనంగా నియమితులైన అర్చకులు కేతముక్కల పవన్‌కుమార్ శర్మ, మాధవ్‌ల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. కొత్తగూడెం విజయవిఘ్నేశ్వరస్వామి దేవస్థాన అర్చకులు అనిపెద్ది ప్రసన్నకుమార్ శర్మ, వేదపారాయణం దయతో సుబ్రహ్మణ్యశర్మల మంత్రోచ్చారణల మధ్య వరుణ హోమం, వరుణ జపం నిర్వహించారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని పండితులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సహస్ర ఘటాభిషేకంతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో మార్మోగింది. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఇన్నోవేషన్ కమిటీ చైర్మన్ చీకటి నరసింహారావు, కమిటీ సభ్యులు మిట్టపల్లి నరేంద్ర, మాణిక్యాల ప్రసాద్, గంగిశెట్టి జగదీష్‌కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, దేవాలయ సిబ్బంది, అర్చకులు, సేవా సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

## పెట్టుబడిదారీ విధానాలకు సమాధి కట్టాలి

### కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై చాడ వెంకటరెడ్డి ధ్వజం -హసన్‌పర్తికి చేరుకున్న సీపీఐ ప్రచార జాతా



**హసన్‌పర్తి/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆయన విమర్శించారు.సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా శనివారం హసన్‌పర్తి మండల కేంద్రానికి చేరుకుంది. మండల కార్యదర్శి మెట్టు శ్యామ్‌సుందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ విలువలను బలహీనపరుస్తోందని ఆరోపించారు.దేశంపై భారీగా అప్పులు పెంచుతూ ప్రజా సంపదను పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగా మళ్లిస్తున్నారని విమర్శించారు. ‘వికసిత్ భారత్’ పేరుతో దేశాన్ని అభివృద్ధి చేయకుండా విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని విద్యార్థులు, యువత, కార్మికులకు పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ నెల 14 వరకు ప్రచార జాతాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద లక్షలాది మందితో మహాధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట భిక్షపతి, బీకేఎంయూ జాతీయ నాయకుడు మోతె లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, ఎన్ఏ స్టాలిన్, ఊట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల గొంతుక కేంద్రానికి వినిపించాలి

### ప్రశ్నించే తత్వంతోనే ఉజ్వల భవిష్యత్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**మడికొండ /ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు చిన్ననాటి నుంచే సమస్యలపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మడికొండలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో నిర్వహించిన ఛత్రోన్ కీ గూంజ్ (విద్యార్థుల గర్జన) కార్యక్రమంలో ఆయన పాల్గొని రాహుల్‌గాంధీ లైవ్ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగం, ప్రశ్నపత్రాల లీకేజీలు, యువత భవిష్యత్తుపై రాహుల్‌గాంధీ నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. యువత సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి అర్థమయ్యేలా ప్రతి ఒక్కరూ గళమెత్తాలని సూచించారు. దేశంలో ఎక్కడ విద్యా వ్యవస్థకు అన్యాయం జరిగినా కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పక్షాన పోరాడుతుందని తెలిపారు. ప్రశ్నించే గొంతుక ఉంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్‌రాజ్, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి రోష్నీ కుశాల్ జైస్వాల్, జాతీయ కార్యదర్శి తక్కళ్లపల్లి సాగరిక, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మాజీ డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు


**తల్లాడ/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు గంటల వెంకటాచారి ఆధ్వర్యంలో నాయకులు మధుసూదనాచారిని కలిసి పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాజీ డిప్యూటీ స్పీకర్‌తో చర్చించారు. విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.అనంతరం ప్రముఖ నాయకుడు తుమాటి రామారావు సతీమణి శ్రీదేవి మధుసూదనాచారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# వృత్తి ధర్మంగా.. పేపర్ బాయ్!

**22 ఏళ్లుగా తెల్లవారుజామునే పాఠకుల ఇళ్లకు వార్తలు -పేపర్ వేస్తూనే ఎంబీఏ పూర్తి.. నేడు ప్రైవేట్ ఉద్యోగం**

**ఎల్కతుర్తి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** తెల్లవారకముందే ఆయన రోజు మొదలవుతుంది. ఒక చేతిలో పత్రికల కట్ట. మరోవైపు సైకిల్ లేదా ద్విచక్రవాహనం. గ్రామంలోని ప్రతి వీధిలో పరిచయమైన అడుగులు. పాఠకుల ఇంటి గుమ్మం ముందు నిత్యం కనిపించే వార్తా పత్రిక. 22 ఏళ్లుగా దామెర గ్రామానికి చెందిన గొర్రె దయాకర్ జీవితంలో ఇదొక భాగమైపోయింది. పేపర్ బాయ్‌గా మొదలైన ఆయన ప్రయాణం. చదువుతో కలిసి సాగింది. కష్టాలను ఎదుర్కొంటూనే ఎంబీఏ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం సాధించినా తనకు అన్నం పెట్టిన పేపర్ పంపిణీ వృత్తిని మాత్రం వదల్లేదు.



### చిన్న వయసులోనే మొదలు..

పాఠశాలలో చదువుకుంటున్న సమయంలోనే దయాకర్ పేపర్ బాయ్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. తెల్లవారుజామున పత్రికలు తీసుకుని ఇంటింటికీ వెళ్లి అందించడం.. ఆ తర్వాత పాఠశాలకు వెళ్లడం.. ఇదే ఆయన దినచర్యగా మారింది. పేపర్ వేస్తూ ఎన్నో కష్టసుఖాలను చూశానని దయాకర్ గుర్తుచేసుకున్నారు. అయితే ఏనాడూ ఆ వృత్తిని చిన్నచూపు చూడలేదని చెబుతున్నారు. ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, జనంసాక్షి, సాక్షి, డెక్కన్ క్రానికల్ తదితర పత్రికలను పాఠకులకు అందిస్తూ వచ్చారు. 22 ఏళ్ల క్రితం నెలకు రూ.150తో ప్రారంభమైన ఆదాయం ప్రస్తుతం సుమారు రూ.8 వేల వరకు చేరిందని తెలిపారు.

### పేపరే.. పాఠశాల!

పత్రికలు పంచుతూ. అందులోని వార్తలను చదువుతూ. సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకుంటూ తన చదువును కొనసాగించినట్లు దయాకర్ తెలిపారు. పేపర్ తనకు కేవలం ఉపాధి ఇవ్వలేదని. చదువుకు కూడా దారి చూపిందని అన్నారు. తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో చదువుకుంటూనే పేపర్ పంపిణీ చేశానని చెప్పారు. పట్టుదలతో చదివి ఎంబీఏ పూర్తి చేశానని, ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నానని తెలిపారు. ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా పేపర్ పంపిణీని ఆపకపోవడం తనకు గర్వంగా ఉందన్నారు. పేపర్ బాయ్ అనే పేరంటే ఇష్టం. పేపర్ బాయ్‌గా తనకు గ్రామంలో ప్రత్యేక గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని దయాకర్ చెప్పారు. 'నరేంద్ర మోదీ, అబ్దుల్ కలాం, రామోజీరావు లాంటి గొప్పవాళ్లు కూడా ఒకప్పుడు పేపర్లు వేశారు. అలాంటప్పుడు నేనెంత అంటూ నవ్వుతూ చెప్పడం ఆయనలోని ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. వృత్తి చిన్నదా. పెద్దదా అన్నది కాదు దానిని ఎంత నిజాయితీగా చేస్తున్నామన్నదే ముఖ్యమని దయాకర్ అంటున్నారు. 22 ఏళ్లుగా తెల్లవారుజామునే పాఠకుల ఇంటి గుమ్మం వద్దకు వార్తను చేర్చుతున్న ఆయన పేపర్ బాయ్ వృత్తికి ఓ కొత్త అర్థాన్ని చెబుతున్నారు.

## తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు**



**ఎల్కతుర్తి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్ రజిత అన్నారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. శిశువు పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, అవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ కోరె లావణ్య మాట్లాడుతూ పుట్టిన శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని అన్నారు. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరమని, తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆయా జ్యోతి, ఏఎన్ఎం స్వరూపరాణి, ఆశా కార్యకర్త పుష్పలత, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పురుగుమందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

**పెంచికల్‌పేట్‌లో రైతులకు అవగాహన**



**ఎల్కతుర్తి/ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** పంటలపై పురుగుమందులను విచక్షణారహితంగా వినియోగించకుండా, సూచించిన మోతాదులోనే ఉపయోగించాలని బీసీఐ ఫీల్డ్ ఆఫీసర్ వంగా రఘు రైతులకు సూచించారు. నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్ గ్రామంలో శనివారం రైతులకు పంట రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా రఘు మాట్లాడుతూ పురుగుమందుల డబ్బాలపై ఉన్న సూచనలు, హెచ్చరికలను పూర్తిగా చదివిన తర్వాతే వినియోగించాలని తెలిపారు. పురుగుమందుల పిచికారీ సమయంలో వ్యక్తిగత రక్షణ పరికరాలు ఉపయోగించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సురక్షితమైన ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు అవగాహన కల్పించారు.
అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పురుగుమందుల సురక్షిత వినియోగం, పీపీఈ ప్రాధాన్యత, హెచ్‌హెచ్‌పీపై రైతులకు వివరించారు. బయోచార్ వినియోగంతో నేల ఆరోగ్యం, తేమ నిల్వ సామర్థ్యం, పంట ఎదుగుదల మెరుగుపడతాయని తెలిపారు. అంతర పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ కార్డుల ద్వారా పురుగులను గుర్తించి నియంత్రించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సురక్షితమైన పంట రక్షణ పద్ధతులను పొలాల్లో అమలు చేసేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేశారు. సంస్థ ప్రతినిధులు రావుల లత, సురకంటి రజిత, పలువురు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి- ఇన్చార్జి ప్రిన్సిపాల్ జోష్ణ.**





**పర్వతగిరి/ ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పీఎం శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల. ఇన్చార్జి ప్రిన్సిపాల్ జోష్ణ సూచించారు. రెండో శనివారం సందర్శనలో భాగంగా పాఠశాలలో నూతన తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జోష్ణ , ఉప ప్రధానాచార్యులు కే. ప్రవళిక, ఎస్. స్వాతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, వసతి సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని



పరిష్కరించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ నరుకుడు స్వప్న, వైస్ చైర్‌పర్సన్ గణిపాక జోష్ణ, గౌరవ అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, కమిటీ సభ్యులు మహంకాళి యాదగిరి, పసునూరి భాస్కర్, బిర్రు కరుణాకర్, జన్ను కుమారస్వామి, శ్రీవిద్య, స్వప్న, అనూష, మేకరి మల్లికార్జున్, బండారి రాజు, బిర్రు రవీందర్, విల్సన్, వైష్ణవి, ఇల్లందుల శంకర్, కమలహాసన్, పసునూరి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కుక్కలు.. కోతుల స్వైరవిహారం!

**18 గ్రామాల్లో ప్రజలకు కంటిమీద కునుకు కరువు**
**వీధుల్లో గుంపులుగా కుక్కలు.. ఇళ్లపైకి కోతుల దండయాత్ర**
**చిన్నారులు, వృద్ధులు, మహిళల్లో భయాందోళన**
**దాడులు జరిగినా.. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు!**

**వర్ధన్నపేట /ఆగస్టు 8 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలంలోని గ్రామాల్లో ప్రజలకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. కుక్కలు, కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో గ్రామీణులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో పలు వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు ప్రజలను వెంబడిస్తుండగా. కోతులు ఇళ్లలోకి చొరబడుతూ హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

### వీధుల్లో కుక్కల గుంపులు

గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చెత్తాచెదారం, ఆహార వ్యర్థాలు పేరుకుపోతున్న ప్రాంతాల్లో వీటి సంఖ్య మరింత పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే ప్రజలను కుక్కలు వెంబడిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంట పరుగెత్తడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని గ్రామస్థులు చెబుతున్నారు. చీకటి పడిన తర్వాత వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కల కారణంగా అత్యవసర పనులపై బయటకు వెళ్లాలన్నా ప్రజలు భయపడుతున్నారు.

### ఇళ్లపై కోతుల దాడి!

కుక్కలతో పాటు కోతుల బెడద కూడా గ్రామాల్లో తీవ్రంగా ఉంది. ఇళ్ల పైకప్పులపైకి ఎక్కుతున్న కోతులు తలుపులు, కిటికీల ద్వారా ఇళ్లలోకి చొరబడుతున్నాయి. వంటగదిలోని ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, బట్టలను చింపేయడం, వస్తువులను కిందపడేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. కోతులను తరిమేందుకు ప్రయత్నిస్తే అవి తిరిగి దాడికి దిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా ఉన్న సమయంలో కోతులు ఇళ్లలోకి రావడం మరింత ప్రమాదకరంగా మారుతోంది.

### పంటలకూ నష్టం

కోతుల బెడద ఇళ్లకే పరిమితం కాలేదు. గ్రామాల



పరిసరాల్లోని పంట పొలాల్లోకి ప్రవేశిస్తున్న కోతులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెరిగిన పరిస్థితుల్లో కోతుల కారణంగా పంట నష్టం కలగడం రైతులకు అదనపు భారంగా మారుతోంది.

### సమస్య తెలిసినా.. స్పందన ఏది?

కుక్కలు, కోతుల సమస్యపై ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్య తీవ్రత పెరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందించడం. ఆ తర్వాత మళ్లీ పట్టించుకోకపోవడం వల్ల సమస్య మరింత ముదురుతోందని గ్రామస్థులు అంటున్నారు.

### ప్రమాదం జరిగే వరకు వేచిచూస్తారా?

ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిసినా ముందస్తు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుక్కకాటు లేదా కోతుల దాడి జరిగిన తర్వాత బాధితులకు చికిత్స అందించడం కంటే.. దాడులు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే అధికారుల బాధ్యత.

### సమగ్ర కార్యాచరణకు డిమాండ్

మండలంలోని 18 గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడదపై అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వీధికుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలని, చెత్తాచెదారం తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.
కోతుల సమస్య పరిష్కారానికి పంచాయతీ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ప్రమాదం కలగకుండా నిపుణుల సహకారంతో కోతులను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### ప్రజల భద్రతే పాలనకు కొలమానం

గ్రామాల్లో ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి రావడం సాధారణ విషయం కాదు. ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న కుక్కలు, కోతుల సమస్యను అధికారులు ఇకనైనా తీవ్రంగా పరిగణించాలి. ఒక పెద్ద ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు. ప్రమాదం జరగకముందే మేల్కొనాలి. వర్ధన్నపేట మండలంలోని 18 గ్రామాల ప్రజలకు భద్రత కల్పించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.